## వరంగల్ అపోలో ఎన్ఎస్ఆర్ హాస్పిటల్‌లో క్యాన్సర్ సెంటర్ ప్రారంభం

కాశీబుగ్గ, నవంబర్ 8: గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ ఆరెపల్లిలో ఉన్న అపోలో ఎన్ఎస్ఆర్ హాస్పిటల్‌లో బుధవారం క్యాన్సర్ సెంటర్‌ను అపోలో హైదరాబాద్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ పీ విజయ్ ఆనంద్‌రెడ్డి ప్రారంభించారు. ఎన్ఎస్ఆర్ గ్రూప్స్ చైర్మన్ ఎన్ సంపత్‌రావు జ్యోతిప్రజ్వాళన చేశారు. ఈ సందర్భంగా విజయ్ ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్సకు ఆధునిక పరికరాలతో మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. పేషెంట్‌కు పర్సనలైజ్డ్ సెంట్రిక్‌కేర్‌ను అందించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని ద్వారా త్వరగా రోగనిర్ధారణ, అత్యుత్తమైన వైద్యసేవలను పొందుతారని చెప్పారు. కొత్త రోబోటిక్ టెక్నాలజీ ద్వారా క్యాన్సర్‌కు సమర్థమైన చికిత్స తోపాటు శస్త్రచికిత్సలు వంద శాతం ఖచ్చితత్వంతో నిర్వహించవచ్చని తెలిపారు. దీని ద్వారా రోగులు త్వరగా కోలుకుంటారని పేర్కొన్నారు. హాస్పిటల్ సీఈవో డాక్టర్ నగేశ్, వైద్యులు పాల్గొన్నారు.



క్యాన్సర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న అపోలో డైరెక్టర్ డాక్టర్ విజయ్ ఆనంద్‌రెడ్డి, చిత్రంలో ఎన్ఎస్ఆర్ గ్రూప్స్ అధినేత సంపత్‌రావు

## కాంగ్రెస్ అభ్యర్థి ఎన్నికల కోడ్ ఉల్లంఘన

### ఐనవోలు ఆలయ ఆవరణలో ప్రచార హామీలపై కేఆర్ నాగరాజు ప్రసంగం



ఐనవోలు, నవంబర్ 8: వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కేఆర్ నాగరాజు ఐనవోలు మల్లికార్జునస్వామి సాక్షిగా బుధవారం ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. నామినేషన్ సందర్భంగా స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం ఉత్తర ద్వారం వద్ద ఆయన పార్టీ ఎన్నికల ప్రచార హామీలు, రాజకీయ విమర్శలు చేయగా, కార్యకర్తలు నినాదాలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను నెరవేరుస్తుందంటూ కోడ్ ఉల్లంఘించారు. కాగా, ఇక్కడ దేవాలయ ఆవరణంలో సమావేశాలు నిర్వహించొద్దని అధికారులు ఫ్లెక్సీ ఏర్పాటు చేసినా పట్టించుకోలేదు. ఒక విశ్రాంత ఐపీఎస్ కోడ్ ఉల్లంఘించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

# ఢిల్లీకి గులాం అవుదామా.. గల్లీలో అభివృద్ధి చేసుకుందామా..

- ప్రజలను అరిగోస పెట్టిన కాంగ్రెస్
- సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం సస్యశ్యామలం
- వర్ధన్నపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్
- పర్వతగిరి మండలంలో విస్తృత ప్రచారం



వడ్లకొండలో ఓటు అభ్యర్థిస్తున్న వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేశ్

పర్వతగిరి, నవంబర్ 8: ఢిల్లీకి గులాం అవుదామా.. గల్లీలో అభివృద్ధి చేసుకుందామా అని ప్రజలు ఆలోచించాలని వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. బుధవారం మండలంలోని వడ్లకొండ, రోళ్లకల్, నారాయణపురం, సోమారం, జమాల్‌పురం, గోరుగుట్టతండా, చౌటపెల్లి, హట్యాతండా, దౌలత్‌నగర్, సీకే తండా, ఇస్లావత్ తండాల్లో వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులు, మహిళలు, ప్రజలు డప్పుచప్పుళ్లు కోలాటాలు, బతుకమ్మలు, మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల వేళ కొత్త వేషాలతో వస్తున్న వారి మాటలు నమ్మొద్దని చెప్పారు. పదేండ్లుగా ప్రజల కష్టాల్లో భాగస్వామినవుతున్న తనను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలకు అడ్డూ అదుపు లేదని, తెలంగాణలో అధికారంలోకి వచ్చేది లేదని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని చెప్పారు. 50 ఏండ్లు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను అరిగోస పెట్టిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడొచ్చి ఏదో ఎలగబెట్టుతనంటోందని ఎద్దేవా చేశారు. సమైక్యాంధ్రలో ఎంత బాధలు అనుభవించామో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. వ్యవసాయానికి 24గంటల కరెంట్ వద్దని, మూడు గంటల కరెంట్ చాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అంటున్నాడని, ఎలా సరిపోతుందో చెప్పాలని అడిగారు. కాంగ్రెస్ పాలనలో విత్తనాలు లేక, ఎరువులు దొరక్క, పురుగుల మందు పనిచేయక, గిట్టుబాటు ధర రాక, అప్పులు తీరక వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వివరించారు. తెల్లారి లేస్తే పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య, ఉరేసుకుని ఆత్మహత్య అనే వార్తలు చూసేవాళ్లమని చెప్పారు. ఇప్పుడు సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం ఎంతో సస్యశ్యామలంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ వస్తే సంక్షేమ పథకాలు రద్దు అవుతాయని చెప్పారు. కర్ణాటక రాష్ట్రంలో కరెంట్ సరిగా ఇవ్వలేని కాంగ్రెస్ ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో వచ్చి రాని కరెంట్‌తో ఎంతో తిప్పలు పడేదని, రాత్రి పూట కరెంట్ మోటార్ పెట్టడానికి పోయి షాక్‌కొట్టి చనిపోయిన రైతులు, పాములు తేళ్లు కుట్టి ఎంతో మంది చనిపోయారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలో అందరూ ముఖ్యమంత్రి అభ్యర్థులమని చెప్పుకుంటున్నారని, అభివృద్ధి చేస్తామని ఒక్కరు కూడా చెప్పడంలేదన్నారు. బీజేపీ ఇప్పటి వరకు మ్యానిఫెస్టో ప్రకటించలేదన్నారు. రెండుసార్లు తనను బిడ్డగా కడుపులో పెట్టుకుని చూసుకున్నారని, నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గ అభివృద్ధికి కష్టపడి పని చేశానని చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గంలో రూ.4వేల 354 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని, పర్వతగిరి మండలంలోనే రూ.700కోట్లతో చేపట్టినట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో మరోసారి ప్రజలకు సేవచేసే అదృష్టం వచ్చిందని, మరోసారి తనను ఆశీర్వాదించాలని కోరుతున్నట్లు తెలిపారు. ఎంపీపీ కమల పంతులు, జడ్పీటీసీ సింగ్‌లాల్, వైస్ ఎంపీపీ రాజేశ్వర్ రావు, సర్పంచులు అమడగాని రాజు, రామ్మోహన్, వెంకటేశ్వర్లు, రాపాక రేణుక, పిడుగు రేణుక, ఉమారాజు, సరోజన, మార్కెట్ డైరెక్టర్ ఏకాంతంగౌడ్, బోయినపల్లి యుగేందర్‌రావు పాల్గొన్నారు.



కాశీబుగ్గ: కారల్‌మార్క్స్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న రాపర్తి శ్రీనివాస్



వర్ధన్నపేట: వర్ధన్నపేట పట్టణంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



హసన్‌పర్తి: సూదన్‌పల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

వర్ధన్నపేట, నవంబర్ 8: బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేశ్ తరపున పార్టీ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ వ్యాప్తంగా జోరుగా ప్రచారం చేస్తున్నారు. మండలంలోని దమ్మన్నపేటలో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, వైస్ ఎంపీపీ చొప్పరి సోమలక్ష్మి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ర్యాలీ, ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అరూరి మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందితే నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. విపక్ష పార్టీల నాయకులు ప్రజలను తప్పుదారి పట్టించేలా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ స్వామిరాయుడు, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్‌కన్నా, మాజీ ఎంపీపీ నూనె భిక్షపతి, సిలువేరు కుమారస్వామి, సమ్మయ్య, రహీమ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

### నాగారం, సూదన్‌పల్లిలో..

హసన్‌పర్తి: మండలంలోని నాగారం, సూదన్‌పల్లిలో ఎమ్మెల్యే అరూరి రమేశ్ గెలుపు కోసం బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఆకారపు శంకర్, గుంటి రంజిత్ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి అరూరిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ సునీత, జడ్పీటీసీ సునీత, వైస్ ఎంపీపీ బండా రత్నాకర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పెసరు శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, పాక్స్ చైర్మన్ జక్కు రమేశ్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ కొత్తకొంత సుభాశ్ గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు భగవాన్ రెడ్డి, సర్పంచ్ మోంటె అరుణ్‌కుమార్, ఎంపీటీసీ గౌరు సుమతి, ఆళ్ల రవీందర్ పాల్గొన్నారు. కాగా, గ్రేటర్ 65 డివిజన్ దేవన్నపేటలో డివిజన్ ఇన్‌చార్జి కరుణాకర్ ఆధ్వర్యంలో బూత్ ఇన్‌చార్జిలు, ముఖ్య కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త అరూరి గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామ అధ్యక్షుడు పోలెపెల్లి రాజు(మైకేల్), ఆత్మ డైరెక్టర్ పంజాల భూపాల్‌గౌడ్, పాక్స్ డైరెక్టర్ విజేందర్, మాజీ ఎంపీటీసీ మార్త, నాయకులు చుంచు రవి, వాసుదేవరెడ్డి, సతీశ్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

### కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

కాశీబుగ్గ: బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్‌ను అధిక మెజార్టీతో గెలిపించుకోవాలని 3వ డివిజన్ కార్పొరేటర్ జన్ను షీభారాణీ అనిల్ పిలుపునిచ్చారు. బుధవారం పైడిపల్లిలోని 125వ బూత్ కన్వీనర్ జన్ను సారంగపాణి ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి కారు గుర్తుకే ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. బూత్ కోకన్వీనర్ జన్ను కరుణాకర్, యూత్ అధ్యక్షులు రమేశ్‌పాల్, జన్ను రవి, బొల్లం విజయ్, మచ్చ విజేందర్, సదయ్య, రంజింత్, సంపత్, కృష్ణ, యాకుబ్ పాల్గొన్నారు. నగరంలోని 14వ డివిజన్ కారల్‌మార్క్స్ కాలనీ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాపర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి అరూరిని అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. జన్ను కుమారస్వామి, ఇమ్మడి తిరుపతి, ఆరపల్లి లింగస్వామి, రాపర్తి కరుణాకర్ పాల్గొన్నారు. నగరంలోని 14వ డివిజన్ ఎస్ఆర్‌నగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పసులాది మల్లయ్య ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. కేతిరి రాజశేఖర్, మచ్చర్ల స్టాలిన్, పున్నం ప్రభాకర్, పసులాది వెంకన్న, ఆడెపు అశోక్, కుతిరి సమ్మక్క, నెరెల్ల సరోజన, వినమాల, హైమావతి, రజిత, పద్మ, రాజేశ్వరి, రాధిక, పద్మ, సంతోష్, సతీష్, ప్రేమలత, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఓటుహక్కును ధైర్యంగా వినియోగించుకోవాలి

హసన్‌పర్తి, నవంబర్ 8: అసెంబ్లీ ఎన్నిల నేపథ్యంలో కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్ ఆధ్వర్యంలో బుధవారం కేంద్ర సాయుధ బలగాలతో పెట్రోలింగ్ నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ ప్రజలు ఎన్నికల్లో ధైర్యంగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీల్లో ఓ కారులో రూ.4లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో హసన్‌పర్తి పోలీసులు వివిధ గ్రామాల నుంచి 100 మంది బెల్ట్‌షాపు నిర్వాహకులు, 20 మంది రౌడీ షీటర్లను బైండోవర్ చేసి, వారికి కౌన్సెలింగ్ చేశారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన మొత్తం 250 మందిని బైండోవర్ చేశారు. సీఐ తుమ్మ గోపి, ఎస్సైలు అశోక్‌కుమార్, సురేశ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 11 నుంచి తాడు గుంజుడు పోటీలు

పర్వతగిరి, నవంబర్ 8: పర్వతగిరిలో పర్వతాల శివాలయ పరిసర ప్రాంగణంలో ఈనెల 11వ తేదీ నుంచి తాడు గుంజుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే ఈపోటీల్లో ఉమ్మడి జిల్లాలోని ప్రజలు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.40వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20వేలు అందించనున్నట్లు తెలిపారు. ప్రతి టీమ్‌లో 10 మంది స్త్రీలు, 10 మంది పురుషులు తప్పనిసరిగా ఉండాలని, ఆధార్ కార్డులను సమర్పించి, 9573879358కు ఫోన్ చేసి రిజిష్టర్ చేసుకోవాలని వివరించారు.

## సామాజిక తనిఖీతో 'ఉపాధి' పనుల్లో పారదర్శకత

పర్వతగిరి, నవంబర్ 8: సామాజిక తనిఖీలతో ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత నెలకొంటుందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.సంపత్‌రావు అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై 15వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. అదనపు జిల్లా గ్రామీణాబివృద్ధి అధికారి వసుమతి, ఎంపీడీఓ చక్రాల సంతోష్‌కుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి పద్మనాభరెడ్డి, ఎస్ఆర్‌పీ నర్సయ్య, ఏపీఓ సుశీల్‌కుమార్ పాల్గొన్నారు.